సాక్షి
తూర్పుగోదావరి

గురువారం । 7 । సెప్టెంబర్ । 2023



నిర్లక్ష్యానికి మూల్యం నిండు ప్రాణం

పొరపొచ్చాలతో విడిపోయిన ఆ దంపతులు పెద్దల జోక్యంతో మళ్లీ ఒక్కటి కాగా ఓ తాగుబోతు నిర్లక్ష్యం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదం వారిని శాశ్వతంగా వేరు చేసింది. - 8లో▸



రూ.1,31,134 విరాళం

బిక్కవోలు: గ్రామంలో కొలువైన శ్రీ లక్ష్మీ గణపతి ఆలయానికి గంధం వేంకట విశ్వేశ్వరరావు, వేంకట ఉష దంపతులు (భీమవరం) బుధవారం రూ.1,31,134 విరాళం సమర్పించారు.

బోధనకు కాల్‌దోషం పట్టదిక!



తరగతి గదుల్లో సెల్‌ఫోన్ల వాడకాన్ని ప్రభుత్వం నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని పకడ్బందీగా అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ, డీఈఓలు, డైట్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. - 8లో▸

న్యూస్‌రీల్

పెరుగుతున్న గోదా'వడి'

ధవళేశ్వరం: పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరి ఉధృతి స్వల్పంగా పెరుగుతోంది. దీంతో మిగులు జలాల విడుదలను పెంచారు. కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 2,13,336 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. డెల్టా కాలువలకు 14,800 క్యూసెక్కులు వదిలారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,500, పశ్చిమ డెల్టాకు 7,500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 10.10 అడుగులకు, భద్రాచలం వద్ద 25.90 అడుగులకు నీటిమట్టం చేరింది. భద్రాచలం వద్ద నీటి ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉంది.

ద్రాక్షారామలో రేపు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు

రామచంద్రపురం రూరల్: అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నారు. సుమారు 5 వేల మంది మహిళలు వ్రతాలు ఆచరించుకునేందుకు ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు బుధవారం విలేకర్లకు తెలిపారు. వ్రతాలు ఆచరించుకునే మహిళలు ఉదయం 7 గంటలకే ఆలయానికి చేరుకోవాలని సూచించారు. వారికి ఉచితంగా చీర, రవిక, వరలక్ష్మీ రూపు, అమ్మవారి ఫొటో, పూజా సామగ్రి అందిస్తామన్నారు. ఉదయం 9.01 గంటలకు వ్రతం ప్రారంభమవుతుందని తెలిపారు.

నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆర్‌పీలకు శిక్షణ

రాయవరం: నేషనల్ గ్రీన్ కార్ప్స్ రాష్ట్ర రిసోర్స్ పర్సన్లుగా ఎంపికైన వారికి విశాఖపట్నంలో రెండు రోజుల పాటు రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నారు. గురు, శుక్రవారం జరిగే ఈ శిక్షణకు జిల్లా నుంచి డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్‌గా అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడలి సాయిరామ్, క్లస్టర్ కో ఆర్డినేటర్లుగా సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ గుండేపల్లి ప్రభావతి, రాయవరం మండలం మాచవరం జెడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ కె.రవికుమార్ ఎంపికయ్యారు. వీరు రాష్ట్ర స్థాయిలో జరిగే శిక్షణలో పాల్గొంటారు. ఈ శిక్షణలో పాఠశాలల్లో ఎకో క్లబ్‌ల ఏర్పాటు, గ్రీన్ స్కూల్ ప్రోగ్రాం తదితర అంశాలపై చర్చించనున్నారు.

పంచాయతీ కార్యదర్శులకు మల్టీటాస్క్ విధులు

ఏపీఎస్ఐఆర్‌డీపీ డైరెక్టర్ మురళి



శిక్షణ ఇస్తున్న ఏపీఎస్ఐఆర్‌డీ పీఆర్ డైరెక్టర్ మురళి, చిత్రంలో జెడ్పీ సీఈవో రమణారెడ్డి తదితరులు

కాకినాడ సిటీ: పంచాయతీ కార్యదర్శులు నిత్యం నిర్వహిస్తున్న విధులతో పాటు బహుముఖ (మల్టీ టాస్క్) విధులు కూడా నిర్వహించాల్సి ఉంటుందని ఏపీఎస్ఐఆర్‌డీ పీఆర్ డైరెక్టర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జె.మురళి అన్నారు. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్‌కు చెందిన పంచాయతీ కార్యదర్శులకు ఆగస్టు 29వ తేదీ నుంచి జరుగుతున్న రెసిడెన్షియల్ శిక్షణను పరిశీలించేందుకు ఆయన బుధవారం కాకినాడ వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 12,500 మంది పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తుండగా, వీరిలో 6,500 మంది గ్రేడ్–5 ఉన్నారని వివరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ 26 కేంద్రాల్లో పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కొనసాగిస్తున్నామని మురళి తెలిపారు. గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులు ఉద్యోగాలు పొందిన ప్పటి నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి శిక్షణా పొందలేదన్నారు. వీరు డీడీఓలుగా కొనసాగేందుకు, పంచాయతీరాజ్ చట్టం 1994 గురించి అవగాహన పెంచుకునేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ఈ నెల 3వ తేదీ నుంచి రెండో బ్యాచ్‌గా పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణలో 250 మంది పాల్గొనగా వారికి వివిధ అంశాలపై మురళి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి, సామర్లకోట ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్, డీపీఓ విక్టర్, పలువురు ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.



ఖిలాయ్ ఐఐటీలో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్న డాక్టర్ నానాజీ



ల్యాబ్‌లో పరిశోధనలు చేస్తున్న నానాజీ

పేదరికాన్ని గెలిచి.. స్ఫూర్తిగా నిలిచి..

- సాధారణ రైతు కుటుంబం నుంచి.. అత్యున్నత స్థానానికి..
- ఐఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కుమ్మరిలోవ కుర్రాడు
- కేంద్రం నుంచి ఎ–గ్రేడ్ గెజిటెడ్ హోదా
- పరిశోధనలతో దేశానికి సేవలందిస్తానంటున్న నానాజీ



సీనియర్ శాస్త్రవేత్తలకు తన పరిశోధన అంశాలను వెల్లడిస్తున్న డాక్టర్ నానాజీ

తుని రూరల్: దేశంలోనే అత్యున్నతమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) వంటి విద్యా సంస్థల్లో చదువుకునేందుకు సీటు లభించడమే అదృష్టంగా చాలా మంది భావిస్తారు. అటువంటిది సాధారణ గ్రామీణ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆ యువకుడు ఏకంగా ప్రతిష్టాత్మక ఐఐటీలో ఉద్యోగం సాధించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎ–గ్రేడ్ గెజిటెడ్ హోదా దక్కించుకున్నారు. కాకినాడ జిల్లా తుని మండలం కుమ్మరిలోవ గ్రామానికి చెందిన డాక్టర్ కచ్చాల నానాజీ పేదరికాన్ని జయించారు. పరిశోధనల బాట పట్టి.. ఐఐటీ – ఖిలాయ్‌లో కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. పట్టుదల, ప్రతిభాపాటవాలతో అంచెలంచెలుగా ఉన్నత శిఖరాన్ని అధిరోహించి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఐఐటీలో బోధిస్తూనే పరిశోధనలు కొనసాగిస్తున్నారు.

కష్టాలు అధిగమించి.. ప్రతిభతో రాణించి..

కుమ్మరిలోవలో సాధారణ రైతు కుటుంబానికి చెందిన కచ్చాల అప్పలనాయుడు, వరహాలమ్మ దంపతుల కుమారుడు నానాజీ. వ్యవసాయ పనుల్లో తల్లిదండ్రుల కష్టాన్ని చిన్నప్పుడే కళ్లారా చూశాడు. తమలా తమ బిడ్డ కష్టాలు పడకూడదని ఆ తల్లిదండ్రులు భావించారు. రెండు కిలోమీటర్ల దూరాన తునిలో ఉన్న ఒక ప్రైవేటు స్కూల్లో నానాజీని పదో తరగతి వరకూ చదివించారు. అదే సమయంలో తండ్రి అప్పలనాయుడు మరణించాడు. పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకుని మరీ తల్లి వరహాలమ్మ తన బిడ్డను చదువులో ప్రోత్సహించింది. తన ప్రతిభతో నానాజీ పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీస్‌లో చదువుకునే అవకాశాన్ని అందిపుచ్చుకున్నాడు. అక్కడే ఇంటర్, కెమిస్ట్రీలో డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ పూర్తయ్యింది. ఐఐటీ మద్రాసు నుంచి కెమిస్ట్రీలో పీహెచ్‌డీ పూర్తి చేసి, డాక్టరేట్ పొందారు. దీనికి ఉత్తమ పీహెచ్‌డీగా నానాజీకి ప్రొఫెసర్ వెర్నర్ ప్రైజ్ లభించింది. అనంతరం అతడు హైదరాబాద్‌లోని భారత ప్రభుత్వ ఆర్‌అండ్‌డీ సెంటర్ ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్(ఏఆర్‌సీఐ)లో ఐదేళ్లు శాస్త్రవేత్తగా పని చేశారు. బెంగళూరు ఓలా ఎలక్ట్రిక్ బ్యాటరీ ఇన్నోవేషన్ సెంటర్‌లో సీనియర్ మేనేజర్, ప్రిన్సిపాల్ ఇంజినీర్‌గా బాధ్యతలు నిర్వహించారు. లి–అయాన్ బ్యాటరీ డ్రై ఎలక్ట్రోడ్ కోటింగ్‌లో పని చేశారు.

అదృష్టంగా భావిస్తున్నా..



దేశంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) అత్యుత్తమ సాంకేతిక విద్యా సంస్థ. దీనిలో సీటు పొందిన ప్రతి విద్యార్థీ తెలివైనవారే. అటువంటి వారికి బోధించే అవకాశం, అత్యాధునిక పరిశోధనలు చేసే అదృష్టం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నాకు దక్కింది. గౌరవప్రదమైన స్థానం లభించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, దేశానికి సేవలు అందిస్తాను. నా విజయంలో అమ్మానాన్నల ప్రోత్సాహం, చిన్నాన్న తలుపులు, గ్రామస్తుల సహకారం మరువలేనిది.

– డాక్టర్ కచ్చాల నానాజీ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఐఐటీ, ఖిలాయ్

ఆనందంగా ఉంది



నా కుమారుడు నానాజీకి ఉన్నతమైన ఉద్యోగం లభించడం ఆనందంగా ఉంది. మాలా వ్యవసాయ పనుల్లో ఉండి పోకుండా నానాజీని నా భర్త అప్పలనాయుడు ప్రోత్సహించి చదువుకు పంపించారు. ఆయన మరణించినా ఆయన చూపించిన దారిలో కష్టపడి చదువుతానంటే నేనూ ప్రోత్సహించాను. ఉద్యోగం వచ్చిందన్నదే తప్ప అది ఎంత పెద్దదన్నది నాకు తెలియదు. మంచి ఉద్యోగం లభించిందన్న ఆనందం కలిగింది. ఖిలాయ్‌లోనే క్వార్టర్స్ ఇవ్వడంతో నా కుమారుడిని చూసేందుకు వెళ్తున్నాను. పది రోజులుండి మళ్లీ ఇక్కడికి వచ్చి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తాను.

– కచ్చాల వరహాలమ్మ, నానాజీ తల్లి

అవార్డులు.. అభిరుచులు

సస్టెయినబుల్ మెటీరియల్స్, లి–అయాన్ బ్యాటరీలు, సూపర్ కెపాసిటర్లు, సాలిడ్ స్టేట్ బ్యాటరీలు, హైబ్రీడ్ కెపాసిటర్ల రూపకల్పన, పరిశోధనల అనువాదంపై నానాజీకి ఎంతో మక్కువ. రూ.8.80 కోట్ల విలువైన ముగ్గురు స్పాన్సర్ల ఇండస్ట్రియల్ ప్రాజెక్టుల్లో పని చేశారు. జర్మనీలో ప్రతిష్టాత్మకంగా జరిగిన లిండావ్ నోబెల్ అవార్డు గ్రహీతల సమావేశానికి హాజరయ్యారు. దీనికిగాను డీఎస్‌టీ–డీఎఫ్‌జీ అవార్డు, ఐఐటీ మద్రాసు ఇన్‌స్టిట్యూట్ పరిశోధన అవార్డు, కేవీ ఆర్ఎస్ఎస్ యంగ్ సైంటిస్ట్ సహా అనేక అవార్డులు నానాజీకి లభించాయి. ఐదు పేటెంట్లకు దాఖలు చేశారు. ఆయన రాసిన 30 పత్రాలు అంతర్జాతీయ ప్రఖ్యాత పత్రికల్లో ప్రచురితమయ్యాయి. డాక్టర్ నానాజీ ప్రస్తుతం అమెరికన్ కెమికల్ సొసైటీ, ఎలక్ట్రో కెమికల్ సొసైటీ సభ్యుడిగా ఉన్నారు.

చంద్రబాబు బేషరతుగా రాజీనామా చేయాలి

- అవినీతికి బాధ్యత వహించి, లొంగిపోవాలి
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా



జక్కంపూడి రాజా

మధురపూడి: అవినీతి, అక్రమాలకు పాల్పడిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తన పదవులకు బేషరతుగా రాజీనామా చేసి, తప్పులు ఒప్పుకుని లొంగిపోవాలని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా డిమాండ్ చేశారు. కోరుకొండ మండలం కాపవరంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అమరావతి, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు సంబంధించిన వందలాది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని చంద్రబాబు కొల్లగొట్టారని ఆరోపించారు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో దిట్ట అయిన ఆయన.. మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు నుంచే అవినీతిలో ఆరితేరాడని విమర్శించారు. తన, పర భేదాలు లేకుండా సొంత ప్రయోజనాలే లక్ష్యంగా వ్యవహరిస్తారని దుయ్యబట్టారు. అవినీతి మహారాజయిన చంద్రబాబు.. ఆదాయ పన్ను శాఖ ఇచ్చిన నోటీసుకు ప్రజాస్వామ్యబద్ధమైన సమాధానం ఇవ్వాలని రాజా డిమాండ్ చేశారు. అమరావతిలో తాత్కాలిక భవనాల నిర్మాణం, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్లలో అవినీతి జరిగినట్టు స్పష్టమైన ఆధారాలతో నిరూపణ అయ్యిందని చెప్పారు. ప్రజాధనాన్ని స్వాహా చేసిన చంద్రబాబుపై చర్యలు తీసుకోవాల్సిందిగా గడప గడపకూ కార్యక్రమంలో ప్రజలు డిమాండ్ చేస్తున్నారన్నారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించిన వాహన చోదకుడిపై సైతం కేసులు నమోదు చేస్తున్న నేపథ్యంలో చంద్రబాబుపై కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని కోరారు. రాజకీయాల్లోకి వచ్చినప్పుడు ఆయన ఆస్తి ఎంత, ఈ రోజు ఎంత ఉందని ప్రశ్నించారు. ఆదాయం విషయమై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వేణుగోపాలస్వామికి రూ.5 లక్షల వెండి కవచం



వెండి కవచం అందిస్తున్న దాత సుబ్బారావు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని దేవస్థానం ఉపాలయంలో కొలువై ఉన్న వేణుగోపాలస్వామికి రాజమహేంద్రవరం సాయి విద్యా సంస్థల అధినేత దండుమేను వెంకట సుబ్బారావు, బాల మాలతీదేవి దంపతులు బుధవారం రూ.5 లక్షల విలువైన వెండి కవచం సమర్పించారు. దీనిని అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు అందజేశారు. 5.428 కేజీల వెండితో ఈ కవచం చేయించామని సుబ్బారావు తెలిపారు. తొలుత వెండి కవచంతో స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. దాతకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఏసీ సత్యనారాయణ అందజేశారు. స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, అర్చకుడు సుదర్శనం రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పాల వెల్లువకు ముందస్తు పెట్టుబడి

- లబ్ధిదారుల పాల వ్యాపారానికి రూ.30 వేలు అందించాలి
- కొవ్వూరు డివిజన్‌లో 7,150 పాడి పశువుల కొనుగోళ్లు పూర్తి చేయాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్, కమిషనర్ దినేష్‌కుమార్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జగనన్న పాల వెల్లువ లబ్ధిదారులు ఒక్కొక్కరికి ముందస్తు పెట్టుబడిగా రూ.30 వేల స్వల్పకాలిక రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో జగనన్న పాల వెల్లువ యూనిట్ల గ్రౌండింగ్‌పై అధికారులతో తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జగనన్న పాల వెల్లువ లబ్ధిదారులకు స్వల్పకాలిక రుణాలు మంజూరు చేసేందుకు కొవ్వూరు డివిజన్‌లో 1,152 మందిని ఎంపిక చేశామని తెలిపారు. వీరికి పెట్టుబడి సహాయం అందించి, అమూల్ కేంద్రాలకు సరఫరా చేసే విధానంలో రుణాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికోసం డీసీసీబీ, జాతీయ బ్యాంకుల నుంచి పశు కిసాన్ క్రెడిట్ కార్డులు అందచేసి, 10 రోజుల్లో గ్రౌండింగ్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ మాట్లాడుతూ, జగనన్న పాల వెల్లువ పథకం కింద కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు, దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం మండలాల్లో 7,150 యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. ఆ మేరకు డీసీసీబీ, జాతీయ బ్యాంకులు, స్త్రీనిధి, ఉన్నతి పథకాల కింద లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని సూచించారు. పశువులను కొనుగోలు చేసి, లబ్ధిదారులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డుల జారీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ ఎస్‌జీటీ సత్యగోవింద్, డీఆర్‌డీఏ పీడీ ఎస్.సుభాషిణి, జిల్లా సహకార అధికారి వై.ఉమామహేశ్వరరావు, ఎల్‌డీఎం డీబీ ప్రసాద్, కొవ్వూరు డివిజన్ డీసీసీబీ అధికారి రమేష్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష


ఈ నెల 30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలుకు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తామని కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఈ కార్యక్రమం అమలుపై సీఎం కార్యాలయ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబులు అమరావతి నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్, అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాధవీలత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పూర్తి సమన్వయంతో పని చేస్తూ గ్రామ స్థాయిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. సమన్వయ శాఖల ద్వారా సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి వలంటీర్ ఇంటింటికీ తిరిగి ప్రజల సమగ్ర ఆరోగ్య వివరాలు తెలుసుకుని, జేఏఎస్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. గ్రామ ఆరోగ్య కేంద్ర పరిధిలోని ప్రతి కుటుంబం, సభ్యుల వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని చెప్పారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అవసరమైన మందులు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు. జేఏఎస్ వైద్య శిబిరాలు విజయవంతం కావడంలో ఇద్దరు వైద్య అధికారులు, స్పెషలిస్ట్ వైద్యులు కూడా కీలక పాత్ర పోషించాలన్నారు. సమావేశంలో జేసీ ఎస్.తేజ్‌భరత్, నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జేకేసీ అర్జీలపై గోపాలపురంలో రేపు సమావేశం


జగనన్నకు చెబుదాం (జేకేసీ) అర్జీల పరిష్కారానికి మండల పరిధిలో సమావేశాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ మాధవీలత ఒక ప్రకటనలో తెలిపారు. తొలి సమావేశాన్ని గోపాలపురం ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని 19 మండలాల్లో ఆ మేరకు కార్యాచరణ రూపొందించి, ముందస్తుగా షెడ్యూల్ ఇస్తామని వివరించారు. ఈ సమావేశానికి జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి వచ్చిన అర్హత కలిగిన జేకేసీ అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు.

రారా.. కృష్ణయ్యా..

- కృష్ణాష్టమికి ముస్తాబైన ఆలయాలు
- నేడు వేడుకలు
- ఇస్కాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు
- తెల్లవారుజాము 4 నుంచి రాత్రి 12 గంటల వరకూ దర్శనాలు
- ఉట్లోత్సవాలకు ఏర్పాట్లు



విద్యుద్దీపాలంకరణలో ఇస్కాన్ ఆలయం



రాధాకృష్ణులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): శ్రీకృష్ణ పరమాత్మ అవతరించే వేళ.. ఆ చిన్ని కృష్ణయ్యకు స్వాగతం పలికేందుకు గోదావరి తీరం సిద్ధమైంది. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు జిల్లాలోని వైష్ణవాలయాలు ముస్తాబయ్యాయి. రాజమహేంద్రవరంలో గోదావరి గట్టున ఇస్కాన్ (అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం), ఆర్యాపురంలోని శ్రీకృష్ణ చైతన్య ఆలయాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా పేరుగాంచాయి. కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా భక్తులు పగలంతా ఉపవాసం ఉండి, సాయంత్రం శ్రీకృష్ణుడిని పూజిస్తారు. శ్రావణ మాసంలో లభించే పండ్లు, అటుకులు, బెల్లం కలిపిన వెన్న, పెరుగు, మీగడ స్వామికి నైవేద్యంగా పెడతారు. ఊయలలో శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఉంచి.. ఊపుతూ భక్తి కీర్తనలు ఆలపిస్తారు. ఉట్లోత్సవం కోలాహలంగా నిర్వహిస్తారు. చిన్నారులకు చిన్నికృష్ణయ్యల వేషం వేసి, వెన్న తినిపించి తల్లిదండ్రులు మురిసిపోతారు. రాజమహేంద్రవరంలో గోదావరి గట్టున క్షేత్రపాలక వేణుగోపాలస్వామి ఆలయం, జాంపేటలోని పాండురంగస్వామి ఆలయం, దేవీ చౌక్‌లోని దశావతార కృష్ణుని గుడి, లాలాచెరువు వద్ద ఉన్న గోవింద క్షేత్రంతో పాటు జిల్లాలోని అన్ని కృష్ణుని ఆలయాల్లో ఈ వేడుకలు నిర్వహించనున్నారు.

ఇస్కాన్‌లో నేటి కార్యక్రమాలు

వేకువన 4.30: మహా మంగళ హారతి
ఉదయం 7.30: శృంగార హారతి
8.14: శ్రీమద్భాగవత ప్రవచనం
9.30: అఖండ హరినామ సంకీర్తన
10.00: పూర్ణాహుతి
11.00: అవభృథ స్నానం
మధ్యాహ్నం 3.00: ఉట్టి ఉత్సవం
సాయంత్రం 5.30: అనంత శేషవాహన సేవ
రాత్రి 7.00: తెప్పోత్సవం
8.00 : శ్రీకృష్ణ లీలామృత ప్రవచనం
10.30: శ్రీశ్రీ రాధా గోపీనాథులకు మహాకుంభాభిషేకం
11.30: మహా మంగళ హారతి, మహాప్రసాద వితరణ


గీతోపదేశంతో మానవాళికి మార్గనిర్దేశం

గీతోపదేశంతో మానవాళికి మార్గనిర్దేశం చేసిన శ్రీకృష్ణభగవానుడి జన్మాష్టమి మన పాపాల్ని హరించి, పుణ్యాల్ని ప్రసాదించే పర్వదినం. మహాభారత యుద్ధాన్ని ముందుండి నడిపించిన మార్గదర్శి శ్రీకృష్ణుడు. ద్వాపర యుగంలో జన్మించిన ఆయన నేటి కలియుగానికి ఆదర్శంగా నిలుస్తున్నారు.


– శ్యామాంగ శ్రీనివాస్, చైర్మన్, ఇస్కాన్, రాజమహేంద్రవరం కేంద్రం

చంద్రయాన్-3లో మన కృష్ణమూర్తి

- కాకినాడ వాసి కావడం గర్వకారణం
- ప్రశంసలు కురిపిస్తున్న స్థానికులు



చంద్రయాన్ సక్సెస్ సందర్భంలో మిగిలిన శాస్త్రవేత్తలతో కృష్ణమూర్తి



కాకినాడ వాసి కృష్ణమూర్తి

కాకినాడ: చంద్రయాన్–3 విజయవంతం కావడంలో మన కాకినాడ వాసి భాగస్వామ్యం కూడా ఉందన్న అంశం తాజాగా వెలుగులోకి వచ్చింది. దేశమంతటా చంద్రయాన్ సంబరాలు చేసుకుంటున్న నేపథ్యంలో ఇక్కడే పుట్టి చదువుకున్న శాస్త్రవేత్త పాత్ర ఉంది. ఆయనే కాకినాడ జగన్నాథపురం ఎంఎస్ఎన్ చార్టీస్‌లో చదువుకున్న కేవీ కృష్ణమూర్తి. ఆయన ఇస్రోలో స్పేస్ క్రాఫ్ట్ ప్రొపల్షన్ సిస్టమ్ ఇంటిగ్రేషన్ గ్రూపులో డ్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ప్రాథమిక విద్య అనంతరం సాంకేతిక విద్యపై ఆసక్తితో ఆంధ్రా పాలిటెక్నిక్‌లో మెకానికల్ పూర్తి చేశారు. దివంగత కొల్లూరు శ్రీరామమూర్తి అవధాని, లక్ష్మీసోదమ్మల నాలుగో సంతానం ఆయన. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విక్రమ్ సారాభాయ్ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోలో చేరి, అక్కడ ఎస్వీ రాజగోపాల్ ప్రోద్బలంతో ఏఎంఐఈఈలో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఆ తరువాత బెంగళూరులోని లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ ఇంటిగ్రేషన్ సెంటర్ బదిలీ అయ్యారు. అక్కడ స్పేస్ క్రాఫ్ట్ ప్రొపల్షన్ సిస్టమ్ ఇంటిగ్రేషన్ గ్రూపులో డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్నారు. చంద్రయాన్–3లో ప్రొపల్షన్ మాడ్యూల్, ల్యాండర్ మాడ్యూల్‌కు పీఎస్ఐ పూర్తి చేయడంలో కీలక పాత్ర వహించారు. ఈ ప్రక్రియ ల్యాండర్ సాఫ్ట్ ల్యాండింగ్‌కు దోహదపడిందని ఆయన తెలిపారు. చంద్రయాన్–3 మిషన్ ఆపరేషన్‌లో ఆయన 45 రోజుల పాటు ఇతర శాస్త్రవేత్తలతో కలసి శ్రమించారు. ప్రస్తుతం ఆయన గగన్‌యాన్ ప్రాజెక్టులో కూడా పని చేస్తున్నారు. ఇస్రోలో 38 ఏళ్ల కెరీర్‌లో కృష్ణమూర్తి మూడు ప్రాజెక్టులకు డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పని చేశారు. చంద్రయాన్–3 సక్సెస్ సమయంలో చివరి 17 నిమిషాలు నరాలు తెగేంత ఉత్కంఠను అనుభవించామని సాఫ్ట్ ల్యాండింగ్‌తో ఊపిరి పీల్చుకున్నామని కాకినాడలోని ఆయన కుటుంబ సభ్యులు సంతోషంగా చెప్పారు. ఇస్రో చైర్మన్ సోమనాథ్ సామర్థ్యం, ఇతర కేంద్రాల డైరెక్టర్ల మార్గదర్శకాలతో చేసిన సమష్టి కృషితో ఇది సాధ్యమైందని, ఈ మొత్తం ప్రాజెక్టులో తమ వాడు ఉండటం గర్వంగా ఉందని ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులు సంతోషం వెలిబుచ్చారు. కాగా ఆదిత్య ఎల్–1 శాటిలైట్‌లో ప్రొపల్షన్ సిస్టమ్ ఇంటిగ్రేషన్ కూడా కృష్ణమూర్తి ఆధ్వర్యంలోనే జరిగిందని అంటున్నారు.

క్లుప్తంగా

పరిశ్రమలకు యథాతథంగా విద్యుత్ సరఫరా

రాజమహేంద్రవరం సిటీ: ప్రస్తుతం రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు విద్యుత్ డిమాండ్ కొంతవరకు తగ్గినందు వలన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఏవిధమైన పరిమితులు లేకుండా పరిశ్రమలకు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ టీవీఎస్ఎన్‌మూర్తి బుధవారం ప్రకటించారు. కొద్ది రోజుల క్రితం విద్యుత్ వినియోగంపై విధించిన పరిమితులను నిలుపుదల చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీంతో పరిశ్రమలకు ఏవిధమైన షరతులు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. ఈ మేరకు రాజమహేంద్రవరం పరిధిలోగల కొన్ని పరిశ్రమలకు నోటీసులు జారీ చేశామని చెప్పారు. అయినా వాటిని పరిగణలోకి తీసుకోకుండా పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులు, విద్యుత్ వినియోగాన్ని ఎలాంటి షరతులు లేకుండా, పవర్ హాలిడేలు లేకుండా పూర్తి స్థాయిలో వినియోగించుకోవచ్చునని పర్యవేక్షక ఇంజినీర్ టీవీఎస్ఎన్‌మూర్తి తెలిపారు.

మద్యం మానివేయాలని మందలించడంతో ఆత్మహత్య

రామచంద్రపురం రూరల్: మద్యం తాగి డబ్బులు తగలేయడం మంచి పద్ధతి కాదని తాతయ్య మందలించడంతో ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తోటపేటకు చెందిన సుందరపల్లి శివ సత్యనారాయణ(26) వాయిద్య కళాకారుడిగా భార్య, ఇద్దరు మగ పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 5న అతని తాతయ్య మద్యం మానివేయాలని మందలించాడు. మనస్థాపానికి గురైన శివ సత్యనారాయణ ఉండూరులో పెదనాన్న ఇంటికి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

బోధనకు కాల్‌దోషం పట్టదిక!

- తరగతి గదుల్లో మొబైల్ ఫోన్ల వాడకం నిషేధం
- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ కమిషనర్
- డీఈవో, డీవైఈవో, ఎంఈవోలకు పర్యవేక్షణ బాధ్యతలు



రాయవరం: దేశ భవిష్యత్తు తరగతి గది నాలుగు గోడల మధ్య నిర్మితమవుతుందని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ డీఎస్ కొఠారి తెలిపారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాల్సిన అవసరం ఉంది. అయితే ఇటీవల మానవ జీవితంలో భాగమైన స్మార్ట్‌ఫోన్లను ఉపాధ్యాయులు తరగతి గదుల్లో వాడడం వలన విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందనే వాదనలు బలంగా విన్పిస్తున్నాయి. తరగతి గదుల్లో సెల్‌ఫోన్లు వాడరాదని ప్రధానోపాధ్యాయులు పదే పదే చెబుతున్నారు. తరగతి గదుల్లో ఫోన్ ఉపయోగించడం వలన విద్యాబోధనపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఉపాధ్యాయుల సెల్‌ఫోన్ వాడకంపై విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కూడా తరగతి గదుల్లో సెల్‌ఫోన్ల వాడకంపై చర్యలు చేపట్టింది. పాఠశాలల్లో మొబైల్ ఫోన్లను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయాలని ఆర్‌జేడీ, డీఈవో, డైట్ కళాశాల ప్రిన్సిపాల్స్‌కు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఏకాగ్రత దెబ్బతింటుంది

జిల్లావ్యాప్తంగా 1,589 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో 6,587 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. పాఠశాలల్లో బోధన సమయంలో ఎటువంటి ఆటంకం రాకుండా, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పూర్తి ఏకాగ్రత పాఠ్యాంశాల మీదనే కేంద్రీకరించాలన్న సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లోని తరగతి గదుల్లో మొబైల్ ఫోన్ల వినియోగంపై నిషేధ నిర్ణయం తీసుకుంది. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు వృత్తిపరమైన అవసరాలకు కాకుండా వ్యక్తిగత అవసరాలకు మొబైల్ ఫోన్లను ఉపయోగించడం వలన బోధనా సమయం వృథా చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు కూడా సెల్‌ఫోన్లు తీసుకుని రావడడంతో పాఠశాలల్లో క్రమశిక్షణ దారి తప్పుతోంది. పలు అంశాలను పరిగణలోనికి తీసుకున్న ప్రభుత్వం తరగతి గదుల్లో మొబైల్ ఫోన్లపై నిషేధం విధించింది.

హెచ్‌ఎం అనుమతితో

ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చిన వెంటనే యాప్‌లో ఫేస్ అటెండెన్స్ నమోదు చేయాల్సి ఉంది. అనంతరం ఉపాధ్యాయులు వారి ఫోన్లను ప్రధానోపాధ్యాయుల గదిలో లేదా పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ (గుమాస్తా) వద్ద డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అత్యవసరం అయితే హెచ్‌ఎం అనుమతితో ఉపయోగించాలి. తరగతి గదుల్లో విద్యాబోధన కోసం ప్రభుత్వం ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, స్మార్ట్ టీవీలు, ట్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ఉపాధ్యాయుడు ఉదయం పాఠశాల పనివేళలకు ముందు, పనివేళల తర్వాత మాత్రమే మొబైల్స్ వినియోగించాలి. ఒకవేళ అటెండెన్స్ తీసుకోవడం ఆలస్యమైతే సంబంధిత హెచ్‌ఎం అనుమతితో సెల్‌ఫోన్ వినియోగించాలి. ఉపాధ్యాయుడు నిబంధనలు అతిక్రమించి తరగతి గదిలో ఫోన్ వినియోగించినట్లు మొదటిసారి గుర్తిస్తే ఇక ముందెన్నడూ ఫోన్‌ను వినియోగించనని సంబంధిత పాఠశాల హెడ్‌కు రాత పూర్వక హామీ ఇవ్వాల్సి ఉంటుంది. రెండవసారి కూడా తరగతి గదిలో అనుమతి లేకుండా ఫోన్ వినియోగిస్తే మొబైల్ ఫోన్‌ను హెచ్‌ఎం తీసుకుని పాఠశాల ముగిసే వరకు హెచ్‌ఎం వద్ద ఉంచుకోవాల్సి ఉంటుంది. అనంతరం ఆ విషయాన్ని మండల విద్యాశాఖాధికారి దృష్టికి హెచ్‌ఎం తీసుకుని వెళ్లాల్సి ఉంటుంది. సంబంధిత ఉపాధ్యాయుడు మొబైల్ ఫోన్ నిబంధనలు పాటించని విషయాన్ని తెలియజేసి, ఎంఈవో హెచ్చరిక జారీ చేస్తారు. మూడవ సారి కూడా నిబంధనలు అతిక్రమిస్తే సంబంధిత ఉపాధ్యాయుడి మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని జిల్లా విద్యాశాఖాధికారికి పంపిస్తారు. జిల్లా విద్యాశాఖాధికారి హెచ్చరిక అనంతరం ఆ విషయాన్ని ఉపాధ్యాయుని సర్వీస్ రిజిస్టర్‌లో రాసిన అనంతరం ఫోన్‌ను తిరిగి ఇస్తారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తరగతి గదుల్లో ఫోన్లు వినియోగించకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలి. నిబంధనలు అతిక్రమించిన వారికి నోటీసు ద్వారా తెలియపర్చాలి. నిబంధనలు అతిక్రమించి ఉపాధ్యాయులు మొబైల్ ఫోన్లను వినియోగిస్తే దానికి హెచ్‌ఎంలను బాధ్యులను చేస్తారు. విద్యార్థుల నుంచి, పబ్లిక్ నుంచి ఉపాధ్యాయులు తరగతి గదుల్లో మొబైల్ ఫోన్లను వినియోగిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే దానికి పాఠశాల హెచ్‌ఎంలను బాధ్యులను చేస్తారు.

ఈ నిబంధనలు పాటించాలి..

ఉపాధ్యాయుడు బోధనకు మొబైల్ ఫోన్‌ను ఉపయోగించాలని భావిస్తే, దాని ప్రయోజనం కచ్చితంగా నమోదు చేయాలి. ప్రధానోపాధ్యాయుడి ఆమోదం తీసుకోవాలి. మొబైల్ ఫోన్ వినియోగం ఎందుకో విద్యా లక్ష్యాల ఆధారంగా స్పష్టంగా పేర్కొనాలి. అకడమిక్ లేదా నాన్ అకడమిక్ ప్రయోజనం కోసం తరగతి గదికి ఫోన్‌ను తీసుకుని వెళ్లాల్సి వస్తే సరైన కారణాన్ని పేర్కొని, ప్రధానోపాధ్యాయుని అనుమతి తీసుకుని, ఆ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలి.

ఉత్తర్వులు కచ్చితంగా పాటించాలి



తరగతి గదుల్లో సెల్‌ఫోన్ వినియోగం వలన బోధనపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఉపాధ్యాయులు ప్రభుత్వ ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలి.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

చర్యలు తీసుకుంటాం



పాఠశాలల్లో సెల్‌ఫోన్లను నిషేధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు పాఠశాలలకు చేరవేశాం. బోధనాభ్యసన ప్రక్రియ సజావుగా సాగడానికే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



బహుమతులు అందుకున్న కోచ్ పూజిత, విద్యార్థులు

పెద్దాపురం: తెలంగాణలోని నారాయణపేట జిల్లాలో నిర్వహించిన 16వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పెద్దాపురం విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. నేషనల్ లెవల్ ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ –2023 పేరిట ఈ నెల 3వ తేదీన పోటీలు నిర్వహించారు. కరాటే కోచ్ పూజిత ఆధ్వర్యంలో ఏడుగురు విద్యార్థులు జాతీయ స్థాయి ప్రతిభ కనపర్చారు. పట్టణానికి చెందిన టి.యోగేష్, పి.లోకేష్, యు.కీర్తి, డి.పూర్ణభాస్కర్ బంగారు పతకం, యు.సాహితి, డి.నిఖిల, డి.చైతన్యలు కాంస్య పతకాలను సాధించినట్లు కోచ్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ : ఒకరి మృతి



శ్రీను మృతదేహం

పెద్దాపురం: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం వడ్లమూరులో చోటు చేసుకుంది. పెద్దాపురం ఎస్‌ఐ వెలుగుల సురేష్ కథనం ప్రకారం కాట్రావులపల్లి గ్రామానికి చెందిన యండ్రు శ్రీను (40) వడ్లమూరు నుంచి పెద్దాపురం వెళుతుండగా వడ్లమూరు వైపునకు వస్తున్న బైక్ బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీను అక్కడికక్కడే మృతి చెందగా ఇంకో బైక్‌పై వెళుతున్న వ్యక్తిని స్థానికులు 108లో తరలించినట్లు తెలిసింది. అతనికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాతృత్వానికి మారుపేరు ఎంఎస్ఆర్

టీటీడీ మాజీ ఛైర్మన్ సుబ్బారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: దాతృత్వానికి మరోపేరుగా నిలిచిన భారతజ్యోతి అవార్డు గ్రహీత దివంగత మేడపాటి సీతారామరెడ్డి దాతృత్వ గుణమే రాజమహేంద్రవరం నగర ప్రజానీకం గుండెల్లో ఆయనను చిరస్థాయిగా నిలిపిందని టీటీడీ మాజీ ఛైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలో దివంగత మేడపాటి సీతారామరెడ్డి 75వ జయంతి(అమృతోత్సవం) సందర్భంగా కంబాలచెరువు సెంటర్‌లో ఎమ్మెస్సార్ హైటెక్ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం స్థానిక శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ఎంఎస్ఆర్‌పై ప్రచురించిన అమృతోత్సవ పుస్తకాన్ని ముఖ్య అతిథిగా ఆవిష్కరించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ మేడపాటి సీతారామరెడ్డి సమాజానికి అందించిన సేవలే ఇక్కడి ప్రజల గుండెల్లో ఆయన్ను చిరంజీవిగా నిలిపాయన్నారు. సీతారామరెడ్డి మరణించి 22 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ కూడా ప్రజలు గుర్తించుకున్నారంటేనే ఆయన వ్యక్తిత్వం, సమాజానికి ఏవిధమైన సేవలు అందించారో తెలియజేస్తుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చేసిన సేవలు ఆయన్ను ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిపాయని, తూర్పుగోదావరి జిల్లాలో మాజీమంత్రి దివంగత జక్కంపూడి రామ్మోహనరావు సేవలను ఇక్కడ ప్రజలు మరువరన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సంక్షేమ పాలన కొనసాగింపుగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ ఎంఎస్ఆర్ సమాజానికి చేసిన సేవలు నేడు ఆయన కోడలు షర్మిలారెడ్డికి ఇంతటి గౌరవాన్ని తీసుకువచ్చాయన్నారు. రుడా ఛైర్‌పర్సన్‌గా చక్కగా పనిచేస్తున్నారని, భవిష్యత్‌లో మరింత ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. మాజీ ఎంపి ఉండవల్లి అరుణకుమార్ మాట్లాడుతూ సీతారామరెడ్డి రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సాయం అందించేవారన్నారు. వందేళ్లకు చేయాల్సిన సేవను సీతారామరెడ్డి 50 ఏళ్లకే చేసేశారని, అటువంటి వ్యక్తిని కోల్పోవడం నగరానికే తీరని లోటన్నారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ కర్రి రామారెడ్డి మాట్లాడుతూ అమృతోత్సవం అంటే మరణాన్ని జయించడం అన్నారు. ఆ కోవలోకే మేడపాటి సీతారామరెడ్డి వస్తారన్నారు. సందర్భంగా మహిళలకు ముఖ్య అతిథులు వైవీ సుబ్బారెడ్డి, జక్కంపూడి విజయలక్ష్మి చేతుల మీదుగా కుట్టుమెషీన్‌లు, ఆటోడ్రైవర్‌లకు ఖాకీ చొక్కాలు పంపిణీ చేశారు.



ఎంఎస్ఆర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న వైవీ సుబ్బారెడ్డి, ఉండవల్లి, జక్కంపూడి రాజా, షర్మిలారెడ్డి తదితరులు

ఎంఎస్ఆర్ సేవా వారసత్వాన్ని కొనసాగిస్తాం : షర్మిలారెడ్డి

ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తూ దివంగత మేడపాటి సీతారామరెడ్డి సేవా వారసత్వాన్ని కొనసాగిస్తామని రుడా మాజీ ఛైర్‌పర్సన్, ఎంఎస్ఆర్ ఫౌండేషన్ సెక్రటరీ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. తన వివాహం ఖాయం అయిన ఆరు నెలలకే ఆయన స్వర్గస్తులయ్యారని, అయితే ఆ ఆరునెలల్లోనే తనపై ఎంతో వాత్సల్యాన్ని చూపించారన్నారు. ఆడపిల్లలు బాగా చదువుకోవాలి, మహిళా సాధికారత సాధించాలని చెప్పేవారని, ఆయన స్ఫూర్తితోనే తాను ఇంజినీరింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించడమే కాకుండా, వ్యాపార, రాజకీయ రంగాలలో రాణించగలుగుతున్నానన్నారు. స్త్రీ సాధికారతకు కృషి చేస్తూ మహిళలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం శాసనసభ్యులు జక్కంపూడి రాజా, జెడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, డీసీసీబీ ఛైర్మన్ ఆకుల వీర్రాజు, వైఎస్సార్ సీపీ సిటీ, రూరల్ కోఆర్డినేటర్లు డాక్టర్ గూడూరి శ్రీనివాస్, చందన నాగేశ్వర్, పెద్దాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు, టీకే విశ్వేశ్వరరెడ్డి, నగర ప్రముఖులు చెరుకూరి వీర్రాజు, పట్టపగలు వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే చందన రమేష్, బైర్రాజు ప్రసాదరాజు, మంతెన సత్యనారాయణరాజు, మంతెన కేశవరాజు, పడాల రామిరెడ్డి, చల్లా శంకర్రావు పాల్గొన్నారు.

175 నియోజకవర్గాల్లోనూ గెలుపు మాదే


ఏ ఎన్నికలు వచ్చినా.. ఎప్పుడు వచ్చినా తాము సిద్ధంగానే ఉన్నామని, 175 నియోజకవర్గాల్లో గెలుపు సాధిస్తామని వైవీ సుబ్బారెడ్డి అన్నారు. రాజమహేంద్రవరంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పేదలు, బలహీన వర్గాలకు సంక్షేమం అందించడంలో తమ ప్రభుత్వం ముందంజలో ఉందని చెప్పారు. అందువల్లనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వల్ల 175 నియోజకవర్గాల్లోనూ గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేశారు. గతంలో వైఎస్సార్ సీపీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను కలుపుకొన్నా చంద్రబాబుకు గట్టి దెబ్బ తగిలిందన్నారు. ప్రజలకు ఝలక్‌లు ఇవ్వడం చంద్రబాబుకు అలవాటేనని విమర్శించారు. టీడీపీ ప్రజలను రెచ్చగొట్టి, దాడులు జరిగేలా చేస్తోందని దుయ్యబట్టారు. యువగళంలో టీ షర్ట్‌లు వేసుకుని, కావాలనే రెచ్చగొడుతున్నారని సుబ్బారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిర్లక్ష్యానికి మూల్యం నిండు ప్రాణం


- బెండపూడి వద్ద జాతీయ రహదారిపై బైకును ఢీకొట్టిన కారు
- భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు
- మద్యం మత్తులో ఉన్న కారు యజమాని



ఘటనా స్థలిలో రాజీ మృతదేహం



తీవ్రగాయాలపాలైన బాల గోపాలకృష్ణ




తాగి కారు నడిపిన యజమాని ప్రసాద్

తొండంగి: పొరపొచ్చాలతో విడిపోయిన ఆ దంపతులు పెద్దల జోక్యంతో మళ్లీ ఒక్కటి కాగా ఓ తాగుబోతు నిర్లక్ష్యం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదం వారిని శాశ్వతంగా వేరు చేసింది. ఆ బిడ్డలను తల్లి లేని తనయులుగా మార్చింది. హృదయ విదారకమైన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. మద్యం తాగుతూ నిర్లక్ష్యంగా కారు నడుపుతున్న ఆ వ్యక్తి బైక్‌పై వెళ్తున్న దంపతులను బలిగొన్నాడు. భార్య మృత్యువాత పడగా భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జాతీయ రహదారిపై తమ్మయ్యపేట శివారు పెట్రోల్ బంక్ వద్ద బుధవారం జరిగింది. తుని మండలం తేటగుంట తిమ్మాపురం గ్రామానికి చెందిన కోరంగి రాజీ (33), కాకినాడకు చెందిన కోరంగి బాల గోపాలకృష్ణ దంపతులు. రాజీ సొంతూరు టి.తిమ్మాపురం నుంచి భర్త బాలగోపాలకృష్ణతో కలిసి బైక్‌పై కాకినాడ వెళ్లేందుకు బయలుదేరారు. బెండపూడి శివారు తమ్మయ్యపేట శివారు నిఖిల్ హైవే దాబా వద్ద జాతీయరహదారిపై అనకాపల్లి నుంచి ఏలూరు వెళ్తున్న కారు వీరి బైకును వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో బైకుపై వెళ్తున్న వారిద్దరూ కొన్ని మీటర్ల దూరం ఎగిరిపడ్డారు. తీవ్ర గాయాలపాలైన వీరిని స్థానికులు సమీపంలోని ఆస్పత్రికి తరలించగా రాజీ తలకు బలమైన గాయాలవ్వడంతో అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. బాలగోపాలకృష్ణ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నాడు. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జయింది. కారు యజమాని ఎస్.ప్రసాద్ మద్యం సేవిస్తూ కారు నడుపుతుండటాన్ని గుర్తించి వెంటనే అదుపులోకి తీసుకున్నామని ఎస్సై వెంకటేశ్వరరావు వివరించారు. మరికొన్ని మద్యం బాటిళ్లు కూడా కారులో ఉండటంతో స్థానికులు, పోలీసులు గుర్తించి అవాక్కయ్యారు. ఈ ఘటనతో జాతీయరహదారిపై సుమారు రెండు గంటలపాటు వాహనాలు నిలిచిపోవడంతో పోలీసు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

అత్తారింటికి వెళ్తూ మృత్యువాత పడిన రాజీ మృతురాలు కోరంగి రాజీ, బాలగోపాలకృష్ణ దంపతులకు ఇద్దరు కుమారులు రామతేజ, దుర్గా మణికంఠ ఉన్నారు. వీరిలో రామతేజ టి.తిమ్మాపురంలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. బాలగోపాలకృష్ణ హైదరాబాద్‌లో డ్రైవర్‌గా ప్రైవేటు ఉద్యోగం, రాజీ హెల్పర్‌గా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరిద్దరికీ దాదాపు మూడు నెలల క్రితం రాజీ అక్క కుమార్తె వివాహానికి హాజరయ్యే విషయంలో మనస్పర్థలు రావడంతో రాజీ చిన్న కుమారుడు దుర్గామణికంఠను తీసుకుని పుట్టింటికి వచ్చేసింది. బాలగోపాలకృష్ణ కొద్ది రోజుల క్రితం చిన్న కుమారుడు దుర్గా మణికంఠను టి.తిమ్మాపురం నుంచి కాకినాడ తీసుకెళ్లాడు. అనంతరం ఇరువర్గాల పెద్దలు రాజీ కుదర్చడంతో బాల గోపాలకృష్ణతో కలిసి కాకినాడలో అత్తారింటికి బైక్‌పై బయలుదేరింది. కారు ఢీకొన్న ప్రమాదంలో రాజీ మృతి చెందడంతో కుమారులు రామతేజ, దుర్గా మణికంఠలతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం తుని ఏరియా ఆస్పత్రికి తరలించామని తొండంగి ఎస్సై జి.వెంకటేశ్వరరావు తెలిపారు.

జాతీయ ఫుట్‌బాల్ శిక్షణ శిబిరానికి యశస్విని



యశస్విని

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): అనంతపురం జిల్లాలో ఈ నెల 5 నుంచి 10 వరకు జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ శిక్షణ శిబిరానికి కాకినాడకు చెందిన నాని కృష్ణ యశస్విని ఎంపికయిందని కాకినాడ జిల్లా క్రీడామైదానం ఫుట్‌బాల్ కోచ్ స్వామి బుధవారం తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ జోనల్ పోటీలలో యశస్విని ప్రతిభను కనపరిచింది. ఈ నెల 10 నుంచి 20 వరకు కర్ణాటకలోని బెల్గామ్‌లో అండర్-13 జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలు జరగనున్నాయి. అనంతపురంలో శిక్షణ శిబిరంలో మంచి ప్రదర్శన కనబరిస్తే జాతీయస్థాయికి ఎంపికయ్యే అవకాశాలు యశస్వినికి ఉన్నాయని కోచ్ స్వామి తెలిపారు. బాలిక 6వ తరగతి చదువుతోంది.

రైల్వేలో అగ్ని ప్రమాదాలపై మాక్ డ్రిల్

సామర్లకోట: రైల్వేలో అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో ఏ విధమైన చర్యలు తీసుకోవాలో ప్రయాణికులకు, రైల్వే సిబ్బందికి అర్థం అయ్యే రీతిలో బుధవారం సామర్లకోట స్టేషన్ ఆవరణలో మాక్ డ్రిల్ నిర్వహించారు. స్టేషన్ మేనేజరు ఎం.రమేష్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ వి.వరప్రసాద్‌ల ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ జరిగింది. రైల్వే స్టేషన్‌లోను, రైలు బోగీలలోను ఉండే అగ్నిమాపక పరికరాలపై అవగాహన కల్పించారు. రైల్వేలోని వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.